

జీడి రైతులను దోచుకునే ఎత్తుగడ

- పరిశ్రమల బంద్ పేరుతో యాజమాన్యాల డ్రామాలు
- మంత్రులు, స్పీకర్ ఎందుకు స్పందించడం లేదు
- వామపక్షాల నాయకులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

జీడి పరిశ్రమల బంద్ పేరుతో యాజమాన్యాలు అటు రైతాంగాన్ని, ఇటు కార్మికులను తీవ్రంగా దోచుకోవడానికి ప్రయత్నం చేస్తున్నాయని సిపిఎం, సిపిఐ, సిపిఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శులు డి.గోవిందరావు, బి.శ్రీరామ్మూర్తి, తాండ్ర ప్రకాశరావు విమర్శించారు. నగరంలోని సుందరయ్య భవన్‌లో శనివారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. జీడి యాజమాన్యాలు జూలై ఐదు నుంచి ఆగస్టు ఒకటో తేదీ వరకు జీడి పరిశ్రమల బంద్ పేరుతో జీడి రైతులకు తీవ్ర అన్యాయం చేస్తున్నాయని విమర్శించారు. బంద్ పేరుతో అతి తక్కువ ధరకు జీడిపిక్కలు తీసుకోవడానికి డ్రామాలు ఆడుతున్నారని ధ్వజమెత్తారు. రైతులకు రెట్టింపు ఆదాయం ఇస్తామని ప్రగల్భాలు పలికిన కేంద్రంలోని బిజెపి, రైతు ప్రభుత్వమని చెప్తున్న రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వాలు జీడికి మద్దతు ధర ప్రకటించి ఎందుకు కొనుగోలు చేయడం లేదని ప్రశ్నించారు. జీడి పరిశ్రమలు బంద్ చేస్తామని వ్యాపారులు చేసిన ప్రకటనపై జిల్లా మంత్రులు, స్పీకర్ స్పందించాలని డిమాండ్ చేశారు.

మద్దతు ధరపై ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని రైతుభరోసా కేంద్రాల ద్వారా జీడిపిక్కలు కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. 80 కేజీల జీడిపిక్కల బస్తాకు రూ.16 వేలు మద్దతు ధర ఇవ్వాలని, కేరళ తరహాలో జీడి బోర్డు ఏర్పాటు చేసి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. జీడి పంటకు మద్దతు ధర వచ్చే వరకు ప్రజల మద్దతుతో దశల వారీ పోరాటం చేస్తామని హెచ్చరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న గోవిందరావు

చుక్క నీరైనా ఇచ్చారా..?

- రైతులతో మాటలు అనిపించుకోవద్దు
- సాగునీటిపై పలువురు సభ్యుల విమర్శలు
- జల్ జీవన్ మిషన్‌లో అసంపూర్తిగా పనులు
- జెడ్‌పి సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధుల అసంతృప్తి



సమావేశంలో మాట్లాడుతున్న స్పీకర్ సీతారాం

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

వంశధార నుంచి చుక్కనీరైనా ఇచ్చారా అంటూ పలువురు సభ్యులు నిలదీశారు. నగరంలోని జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో ఛైర్‌పర్సన్ పిరియా విజయ అధ్యక్షతన శనివారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. పలాస ఎంపిపి ఉంగ ప్రవీణ మాట్లాడుతూ వంశధార నుంచి తమ ప్రాంతానికి నాలుగేళ్లుగా నీరు ఇవ్వడం లేదని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాలువలో పేరుకుపోయిన గుర్రపుడెక్క, పలాస షట్టర్ల ఫొటోలను ప్రదర్శించారు. వంశధార ఎస్‌ఇ డోల తిరుమలరావు, ఎంపిపి మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. ఉద్దేశపూర్వకంగానే తమపై ఆరోపణలు చేస్తున్నారంటూ ఎస్‌ఇ బదులిచ్చారు. పాడైన షట్టర్లు, బలహీనంగా ఉన్న కాలువ గట్టు వంటి సమస్యలు ఉన్నా 91 శాతం మేర నీరందించామని చెప్పారు. అధికారులు చెప్తున్నవన్నీ అబద్ధాలేనని అన్నారు. శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం ఎస్‌ఇ వివరణ ఇస్తున్న సమయంలో ఎంపిపి మాట్లాడుతుండడంతో ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ కూర్చోవాలంటూ సూచించారు. స్పీకర్‌తో పాటు పలువురు స్థానిక ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ రైతులతో మాటలు పడలేకపోతున్నామన్నారు. వంశధార షట్టర్ల సమస్యపై పశుసంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు మాట్లాడుతూ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని, జిల్లా అధికారులు నివేదికను వెంటనే పంపాలని సూచించారు. మదనగోపాల సాగరం పనులపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ అసహనం వ్యక్తం చేశారు. షట్టర్ల రిపేర్లకు మండల పరిషత్ నిధులు కేటాయించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని వంశధార అధికారులకు నరసన్నపేట జెడ్‌పిటిసి గోపి ప్రతిపాదించారు.

జల్ జీవన్ మిషన్‌లో అసంపూర్తిగా పనులు

జల్ జీవన్ మిషన్ పనులు అసంపూర్తిగా జరుగుతున్నాయంటూ స్పీకర్ సీతారాం, ఎమ్మెల్యే వి.కళావతితో పాటు పలువురు జెడ్‌పిటిసి, ఎంపిపిలు అన్నారు. గడప గడపకూ కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో పర్యటిస్తున్న తమను మంచినీటి కోసం ప్రజలు అడుగుతున్నారని చెప్పారు. సిసి రోడ్లను తవ్వేసి వాటిని పూర్తి స్థాయిలో పునరుద్ధరించడం లేదన్నారు. నీటి వనరులను గుర్తించి పైపులైన్లు వేసిన వారికే బిల్లులు చెల్లించాలంటూ అధికారులకు స్పీకర్ సీతారాం సూచించారు. ఉద్దానం రక్షిత మంచినీటి పథకంలో పనులు ఏం జరుగుతున్నాయో తెలియడం లేదని సోంపేట జెడ్‌పిటిసి నిమ్మాన దాస్ అన్నారు.

విద్యాశాఖలో డెప్యుటేషన్లకు అవకాశం ఇవ్వొద్దు

విద్యాశాఖపై నిర్వహించిన సమీక్షలో జెడ్‌పి ఛైర్‌పర్సన్ మాట్లాడుతూ బదిలీలు పూర్తయిన నేపథ్యంలో విద్యాశాఖలో ఎటువంటి డెప్యుటేషన్లకు అవకాశం ఇవ్వవద్దని సూచించారు. పాఠశాలలను అప్‌గ్రేడ్ చేసినా సబ్జెక్టు టీచర్లను నియమించలేదంటూ పలాస ఎంపిపి ప్రవీణ ప్రస్తావించారు. ఖాళీల భర్తీకి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని డిఇఒ తిరుమల చైతన్య తెలిపారు.

లోవోల్టేజీ సమస్యలతో ఇబ్బందులు

విద్యుత్‌శాఖపై నిర్వహించిన సమీక్షలో ఎచ్చెర్ల ఎంపిపి చిరంజీవిరావు, రణస్థలం జెడ్‌పిటిసి సీతారాముడుతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు ట్రాన్స్‌ఫార్మర్ల కెపాసిటీ చాలకపోవడంతో లోవోల్టేజీ సమస్యలు తలెత్తుతున్నాయని సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. లైన్‌మెన్ లేక ఇబ్బందులు వస్తున్నాయని చెప్పారు. మంత్రి అప్పలరాజు మాట్లాడుతూ లైన్‌మెన్ల పోస్టులను రేషనలైజేషన్ చేసి లేని చోట నియమించేలా చూడాలని ఆదేశించారు.

జగనన్న లేఅవుట్లలో సౌకర్యాలు లేవు

సోంపేట జడ్‌పిటిసి నిమ్మాన దాస్, హిరమండలం జడ్‌పిటిసి బుచ్చిబాబు మాట్లాడుతూ జగనన్న లేఅవుట్లలో రోడ్లు, విద్యుత్, నీటి సౌకర్యం లేకపోవడంతో ఇళ్ల నిర్మాణాలకు లబ్ధిదారులు ముందుకు రావడం లేదని చెప్పారు.

'ఉపాధి' నిధులతో చప్టాలు, స్లూయిజ్‌లు బాగు చేయాలి

చప్టాలు, స్లూయిజ్‌లు పాడైపోవడంతో నీరు సరిగా ప్రవహించడం లేదంటూ పలువురు జెడ్‌పిటిసిలు, ఎంపిపిలు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. ఉపాధి నిధులతో సాగునీటి ఛానళ్లనూ బాగు చేయాలని కోరారు.

అలా అయితేనే సోనామసూరి కొనుగోళ్లు

ప్రస్తుత ఖరీఫ్‌లో 37 వేల క్వింటాళ్ల విత్తనాలు, 34 వేల టన్నుల ఎరువులను పంపిణీ చేయనున్నామని వ్యవసాయశాఖ జెడి శ్రీధర్ తెలిపారు. రైతులు ఇకెవైసి చేయించుకోకపోవడం వల్ల పిఎం కిసాన్ డబ్బులను కోల్పోతున్నారని చెప్పారు. సోనామసూరి ధాన్యాన్ని ప్రభుత్వం ఈ ఏడాది కొనుగోలు చేస్తుందా అని రణస్థలం జెడ్‌పిటిసి సీతారాముడు ప్రశ్నించారు. మద్దతు ధర కంటే తక్కువ ఉంటేనే ప్రభుత్వం తీసుకుంటుందని జెడి బదులిచ్చారు.

జూలైలో సిఎం పర్యటన

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి జూలై నెలాఖరులో జిల్లాలో పర్యటించనున్నారని మంత్రి సీదిరి అప్పలరాజు చెప్పారు. ఉద్దానం రక్షిత మంచినీటి పథకం, కిడ్నీ రీసెర్చ్ సెంటర్‌ను ప్రారంభిస్తారని వెల్లడించారు. అప్పటికి జిల్లాలో పెండింగ్‌లో ఉన్న పనులనూ పూర్తి చేసేలా చూడాలని అధికారులను ఆదేశించారు.

సమావేశానికి ప్రాధాన్యతనివ్వని ప్రజాప్రతినిధులు

జిల్లాలో నెలకొన్న పలు సమస్యలపై చర్చించేందుకు నిర్వహించిన సర్వ సమావేశాన్ని ముఖ్య ప్రజాప్రతినిధులు చాలా తేలిగ్గా తీసుకున్నారు. 10.30 గంటలకు మొదలు కావాల్సిన సమావేశం 11.20 గంటలకు ప్రారంభమైంది. అప్పటికి ఒక్క ఎమ్మెల్యే కూడా రాలేదు. అరగంట తర్వాత ఒక్కొక్కరుగా వచ్చారు. తమ్మినేని సీతారాం సమావేశం ప్రారంభ సమయానికి వచ్చి 1.30 గంటలకు వెళ్లిపోయారు. మంత్రి అప్పలరాజు 1.15 గంటలకు వచ్చారు. వీడియో కాన్ఫరెన్స్ ఉండడంతో కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ 1.40 గంటలకు వచ్చారు. రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు సమావేశానికి రాలేదు.

సమావేశంలో సోంపేట జెడ్‌పిటిసి తమ ప్రాంత సమస్యలు చెప్తున్న సమయంలోనే మంత్రి అప్పలరాజు వంశధార సమస్యలపై కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్, ఎస్‌ఇ తిరుమలరావుతో వేదికపై చర్చ నడిపారు. సమావేశంలో ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, ఎమ్మెల్యేలు రెడ్డి శాంతి, కంబాల జోగులు, ఎమ్మెల్సీలు పాలవలస విక్రాంత్, దువ్వాడ శ్రీనివాస్, అటవీ శాఖ అధికారి నిషాకుమారి, జెడ్‌పి సిఇఒ ఆర్.వెంకట్రామన్, పలువురు జెడ్‌పిటిసిలు, ఎంపిపిలు, పలు ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వద్దన్న పథకాలే ఇస్తామంటున్నారు

- చంద్రబాబు ఎన్ని చెప్పినా ఎవరూ నమ్మడం లేదు
- రాష్ట్ర పశుసంవర్ధకశాఖ మంత్రి అప్పలరాజు



సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న అప్పలరాజు

ప్రజాశక్తి - పలాస

సంక్షేమ పథకాలు అమలు చేయడం వల్ల రాష్ట్రం అప్పులపాలైపోతుందని గగ్గోలు పెట్టిన విపక్ష నేత చంద్రబాబు నాయుడు, ఇప్పుడు అవే పథకాలను తామూ ఇస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందని రాష్ట్ర పశుసంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు విమర్శించారు. మున్సిపాల్టీలోని పద్మాపురం కాలనీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు మేనిఫెస్టోలో ఎన్ని పెట్టినా, ఏమేం చెప్పినా ప్రజలెవరూ ఆయన్ను నమ్మడం లేదన్నారు. పద్మాపురం కాలనీలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, ఉప్పు నీరు వల్ల ఇబ్బందులు పడుతున్నట్లు మున్సిపల్ వైస్ ఛైర్మన్ మీసాల సురేష్‌బాబు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాల్టీలో తాగునీటి సమస్య తలెత్తకుండా రూ.వంద కోట్ల వ్యయంతో ఇంటింటికీ కుళాయిల ద్వారా తాగునీటి సరఫరా చేసేందుకు పనులు చేపడుతున్నట్లు చెప్పారు. త్వరలోనే పనులు పూర్తి చేసి నీరందిస్తామన్నారు. కాలువ విస్తరణ పనులు పూర్తి చేసి మున్సిపాల్టీకి కానుకగా ఇస్తామన్నారు. ఇప్పటికే రైల్వే వంతెన పనులు జరుగుతున్నాయని, వాటిని త్వరితగతిన పూర్తి చేసి రాకపోకలు జరిగే విధంగా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ బి.గిరిబాబు, భవానీ శంకర్, కౌన్సిలర్లు సనపల సింహాచలం, పప్పల ప్రసాద్, మున్సిపల్ కమిషనర్ నాగేంద్ర కుమార్, వైసిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర ముఠా అరెస్టు

- 46 కేజీల గంజాయి పట్టివేత
- ఎనిమిది మంది అరెస్టు
- ఎస్‌పి జి.ఆర్ రాధిక

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురం పట్టణంలోని పాత టోల్‌ప్లాజా వద్ద గంజాయి రవాణా చేస్తున్న అంతర్రాష్ట్ర ముఠాను అరెస్టు చేసినట్లు ఎస్‌పి జి.ఆర్ రాధిక తెలిపారు. ఎనిమిది మంది నిందితులను అరెస్టు చేసి, 46.120 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఒడిశా నుంచి తమిళనాడుకు 23 ప్యాకెట్లలోని 46.120 కిలోల గంజాయిని తరలిస్తుండగా, టోల్‌ప్లాజా వద్ద పోలీసులు చేపట్టిన వాహన తనిఖీల్లో పట్టుబడినట్లు తెలిపారు. ఇచ్ఛాపురం మండలంలోని పురుషోత్తపురానికి చెందిన బర్రి పాపమ్మ, దనపాన పూర్ణ, దనపాన మోహనరావుతో పాటు తమిళనాడుకు చెందిన నందకుమార్ గణేషన్, అరుల్ వినరసన్ మణికన్, విశ్వరూబన్ విశ్వనాథన్, లియప్పన్ మురుగన్, రమణ్‌ను అరెస్టు చేశామన్నారు. తమిళనాడుకు చెందిన లీనస్, శరవణ్ పరారీలో ఉన్నారని చెప్పారు. పట్టుబడిన నిందితుల నుంచి తొమ్మిది మొబైల్ ఫోన్లతో పాటు గంజాయి రవాణాకు ఉపయోగించిన స్కూటీని సీజ్ చేసి కేసు నమోదు చేశామన్నారు. గంజాయి రవాణాను అడ్డుకుని నిందితులను పట్టుకోవడంలో కృషి చేసిన ఇచ్ఛాపురం సిఐ ఈశ్వరప్రసాద్, పట్టణ ఎస్ఐ గోవిందరాజు, సిబ్బందిని ఎస్‌పి అభినందించి నగదు పురస్కారాన్ని అందించారు.

గంజాయి అక్రమ రవాణాను నిరోధించేందుకు ప్రత్యేక కార్యాచరణను రూపొందించి నిఘాను పటిష్టం చేశామన్నారు. ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లో స్పెషల్ పోలీసులు, స్థానిక పోలీసులతో ప్రత్యేక బృందాలు నిరంతరం విస్తృతంగా వాహన తనిఖీలు చేస్తున్నాయని చెప్పారు. ప్రయివేటు వాహన యజమానులు, పార్శిల్ సర్వీస్‌లు లగేజ్, పార్శిల్‌ను క్షుణ్ణంగా తనిఖీ చేశాకే అనుమతించాలని స్పష్టం చేశారు. గంజాయి వినియోగాన్ని నివారించేందుకు, మత్తు పదార్థాలకు అలవాటు పడిన వారిని గుర్తించి డి-అడిక్షన్ సెంటర్లలో కౌన్సెలింగ్ నిర్వహించడం, పరివర్తన కార్యక్రమం ద్వారా మార్పు తీసుకొచ్చే చర్యలు సత్ఫలితాలు ఇస్తున్నాయన్నారు. మహిళా పోలీసులు, క్యాంపస్ కాప్స్, జాగృతి కార్యక్రమాల్లో భాగస్వాములైన వారితో ముందస్తు సమాచారాన్ని సేకరించడం ద్వారా జిల్లాను నాటుసారా, గంజాయి రహితంగా చేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో కాశీబుగ్గ డిఎస్‌పి నాగేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న గంజాయిని చూపిస్తున్న ఎస్‌పి రాధిక

శివారు భూములకు సాగునీరందించాలి

ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి మోహనరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

సాగునీటి ప్రాజెక్టులకు అవసరమైన నిధులు కేటాయించి, ఖరీఫ్ సీజన్‌కు ముందే కాలువలు, డ్రైనేజీల మరమ్మతులు చేపట్టి శివారు భూములకు సాగునీరు అందించాలని ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు డిమాండ్ చేశారు. రైతాంగ సమస్యల పరిష్కారానికి ఈనెల 30న విజయవాడలో చేపట్టనున్న మహాధర్నా పోస్టర్‌ను నగరంలోని సుందరయ్య భవన్‌లో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతాంగ సమస్యలపై ఈనెల 26న సచివాలయాలు, నీటిపారుదల శాఖ కార్యాలయాల్లో వినతిపత్రాలు అందజేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం విత్తనం నుంచి విక్రయం వరకు రైతుభరోసా కేంద్రాలు చూసుకుంటాయని చెప్పినా, అక్కడా మిల్లర్లు, వ్యాపారుల పెత్తనమే సాగుతోందన్నారు.

రైతు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, రైతాంగాన్ని ఆదుకోవడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు గతేడాది ఖరీఫ్, రబీ సీజన్లలో పంటలు నష్టపోయిన రైతులందరికీ ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమాను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ఆహార పంటలకు ఎకరాకు రూ10 వేలు, వాణిజ్య పంటలకు ఎకరాకు రూ.25 వేల ఇన్‌పుట్ సబ్సిడీ చెల్లించాలన్నారు. జీడి పంటకు మద్దతు ధర ప్రకటించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలన్నారు.రెండేళ్లుగా సున్నా వడ్డీ, పావలా వడ్డీ పథకాలకు నిధులు ఇవ్వడం లేదని, దీనివల్ల వ్యవసాయ పెట్టుబడులకు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెరిగిన పెట్టుబడులకు అనుగుణంగా సున్నా వడ్డీ పథకం రూ.రెండు లక్షలకు, పావలా వడ్డీ పథకం రూ.ఐదు లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు.

రైతులకు అవసరమయ్యే విత్తనాలను రైతుభరోసా కేంద్రాల ద్వారా అందించాలన్నారు. కౌలు రైతులకు గ్రామసభల ద్వారా గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ప్రభుత్వ పథకాలన్నీ కౌలు రైతులకు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. దేవాదాయశాఖ రైతుల హక్కులను హరిస్తూ ఇచ్చిన 79, 102, 425 జిఒలను ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు పొందూరు చంద్రరావు, తోనంగి నందోడు, జి.కృష్ణారావు, జి.శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.



రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

శ్రీకాకుళం అర్బన్ : ప్రస్తుత సమాజంలో మారుతున్న అలవాట్ల నేపథ్యంలో ప్రతిఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. నగరంలోని జిల్లా కోర్టు భవనంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్ని సూర్యారావు అధ్యక్షతన జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఇన్‌ఛార్జి కార్యదర్శి ఎం.అనురాధ సౌజన్యంతో ఉచిత వైద్య, రక్తదాన, దంత వైద్య శిబిరాలు శనివారం నిర్వహించారు. వైద్య శిబిరాలను జిల్లా జడ్జి ప్రారంభించిన అనంతరం మాట్లాడారు. ఉద్దానం ప్రాంతంలో ఇప్పటివరకు తొమ్మిది వైద్య శిబిరాలను నిర్వహించామని, కోర్టు ఆవరణలోనూ మెడికల్ క్యాంపు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. స్వచ్ఛందంగా రక్తదానానికి ముందుకు వచ్చిన వారికి అభినందనలు తెలిపారు. అనంతరం ప్రాణదాత ఫౌండేషన్, లయన్స్ బ్లడ్ బ్యాంకు ప్రధాన న్యాయమూర్తికి మెమోంటో అందజేసి దుశ్శాలువతో సత్కరించారు. మొదటి అదనపు జిల్లా జడ్జి కె.శ్రీదేవి, మూడో అదనపు జిల్లా జడ్జి పి.భాస్కరరావు, నాలుగో అదనపు జిల్లా జడ్జి ఎస్.ఫణికుమార్, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి శారదాంబ, ప్రోటోకాల్ జడ్జి కె.రాణి, సీనియర్ న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి ఉషు పోటీలకు జిల్లా క్రీడాకారులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

32వ జాతీయస్థాయి ఉషు పోటీల్లో మంచి ప్రతిభ కనబరిచి జిల్లా కీర్తి ప్రతిష్టలను పెంచాలని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ముఖ్య శిక్షకులు కె.శ్రీధర్ క్రీడాకారులకు పిలుపునిచ్చారు. నగరంలోని కోడి రామ్మూర్తి క్రీడా ప్రాంగణంలో శనివారం పయనమైన క్రీడాకారులతో ఆయన మాట్లాడారు. జిల్లా ఉషు క్రీడాకారులు ఇటీవలికాలంలో జిల్లాస్థాయి నుంచి జాతీయస్థాయి వరకు మంచి ప్రతిభను కనబరిచి, రాష్ట్రంలో సైతం ముందంజలో ఉన్నారని కొనియాడారు. జిల్లా ఉషు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రెడ్డి శివకుమార్ మాట్లాడుతూ ఇటీవల గుంటూరులో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో సీనియర్ విభాగంలో ముద్దాడ శిరీష, బైరి ధనుంజయరావు స్వర్ణ పతకాలు సాధించడంతో, ఈనెల 26 నుంచి జూలై ఒకటో తేదీ వరకు పూణేలో నిర్వహిస్తున్న జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. అండర్-65 విభాగంగా శిరీష, అండర్-56 విభాగంలో ధనుంజయరావు పాల్గొంటున్నారని చెప్పారు. కార్యక్రమంలో కురిటి తారకరామ, రెడ్డి సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

ఖరీఫ్ వేళ కయ్యాలు

వీక్షణం

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

ఖరీఫ్ వేళ రైతులకు సాగునీటిని అందించడంపై దృష్టిసారించాల్సిన అధికార, ప్రతిపక్ష పార్టీలు ఒకరిపై ఒకరు విమర్శల దాడి చేసుకుంటున్నారు. టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు ఈనెల 23న కోటబొమ్మాళిలో విలేకరుల సమావేశం నిర్వహించి సాగునీరు అందించడంలో ప్రభుత్వం వైఫల్యంపై విరుచుకుపడ్డారు. రైతులకు సాగు నీరివ్వలేని ప్రభుత్వం వంశధార, నీటిపారుదలశాఖ ఎత్తివేయాలని దుయ్యబట్టారు. ఖరీఫ్ సాగుకు సంబంధించి కనీస ప్రణాళికలు లేవని, సాగునీటి విడుదలకు చర్యలు చేపట్టడం లేదంటూ మండిపడ్డారు. అంతటితో ఆగకుండా టిడిపి హయాంలో 2014 నుంచి 2019 వరకు రైతులకు ఒక స్వర్ణయుగం అంటూ గొప్పలకు పోయారు. టిడిపి ప్రభుత్వ హయాంలో ఏం ఒరగబెట్టారో ఆయన మరిచిపోయినట్లుగా కనిపిస్తోంది.

వంశధార కాలువలు నిర్మించి 50 ఏళ్లు దాటడంతో గట్లు బలహీనంగా మారాయి. కుడి కాలువ ద్వారా 2,200 క్యూసెక్కులు నీటిని విడిచిపెట్టాల్సి ఉండగా 1800 క్యూసెక్కులకు మించి వదిలే పరిస్థితి లేదు. ఎడమ కాలువ ద్వారా 800 క్యూసెక్కులు నీరు విడిచిపెట్టాల్సి ఉండగా, 500 క్యూసెక్కుల నీటినీ విడిచిపెట్టలేకపోతున్నారు. కాలువల ఆధునీకరణ పనుల కోసం 2014 నుంచి అధికారులు ప్రతిపాదనలు పంపుతూనే ఉన్నారు. టిడిపి ప్రభుత్వం ఐదేళ్ల కాలాన్ని పూర్తి చేసుకున్నా, ప్రతిపాదనలకు ఆమోదం తెలపలేదు.

వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత 2020 నుంచి ఇప్పటివరకు సవరించిన అంచనా వ్యయంతో అధికారులు ప్రతిపాదనలు పంపుతున్నా, ఈ ప్రభుత్వమూ అమోదం తెలపలేదు. అచ్చెన్నాయుడు విమర్శలపై పశుసంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు ఒంటి కాలిపై లేచారు. జెడ్‌పిలో శనివారం నిర్వహించిన సర్వ సభ్య సమావేశం అనంతరం విలేకరులతో మాట్లాడుతూ అచ్చెన్నాయుడును ఒక దొంగ అంటూ సంబోధించారు. టెక్కలి నియోజకవర్గంలో అనుమతి లేకుండా ఎత్తిపోతల పథకాలను నిర్మించి అదనంగా 27 వేల ఎకరాలకు నీరు తీసుకెళ్లిపోయారని మండిపడ్డారు. అచ్చెన్నాయుడు చేసిన పనివల్లే పలాస, నందిగాం, వజ్రపుకొత్తూరు ప్రాంతాలకు సాగునీరు రావడం లేదంటూ ప్రభుత్వ వైఫల్యాన్ని ప్రతిపక్షంపై నెట్టేసేందుకు ప్రయత్నించారు. వంశధార సాగునీరు శివారు భూములకు సాగు నీరందకపోవడానికి కారణాలు స్పష్టంగా కనిపిస్తున్నా టిడిపి, వైసిపిలు వాటిని పరిష్కరించడంలో విఫల మయ్యాయి. వంశధార ఆధునీకరణ పనులును రెండు ప్రభుత్వాలూ పట్టించుకున్న పాపాన పోలేదు. జిల్లాలో 13 ఏళ్లుగా షట్టర్ల సమస్య అపరిష్కృతంగా ఉంది. షట్టర్ల కొనుగోళ్లలో అవినీతిపై సిఐడి, విజిలెన్స్ కేసులు నమోదు చేయడంతో కొత్తవి అమర్చలేక పాతవాటితోనే నెట్టుకొస్తున్న పరిస్థితి నెలకొంది. దీంతో పాటు రూ.ఐదారు కోట్ల విలువ చేసే షట్టర్లు నరసన్నపేట వంశధార కార్యాలయంలో మూలుగుతున్నాయి. నాడు టిడిపి ప్రజాప్రతినిధులు గానీ నేడు వైసిపి మంత్రులు, ఎమ్మెల్యేలు గానీ సమస్యను పరిష్కరించలేకపోయారు. తమ అసమర్థతను కప్పిపుచ్చుకునేందుకు ఒకరినొకరు దూషించకుంటూ అసలు సమస్య నుంచి రైతులను దృష్టిమళ్లిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

జీడి పిక్కలకు మద్దతు ధర అంశాన్నీ టిడిపి, వైసిపిలు పరస్పర విమర్శలతో రాజకీయ ప్రయోజనం పొందాలని చూస్తున్నాయి. జీడిపిక్కలపై వామపక్షాల ఆధ్వర్యంలో రైతులు ధర్నాలు, సమావేశాలతో క్రమేణా ఒత్తిడి పెరగడంతో మంత్రి అప్పలరాజు జోక్యం చేసుకోవాల్సిన పరిస్థితి అనివార్యమైంది. పరిశ్రమల యజమానులు, రైతులతో సమావేశం నిర్వహించి మద్దతు ధరపై యజమానులను ఒప్పించేందుకు ప్రయత్నించినా అది నెరవేరలేదు. ఆయన అనుచరులు మాత్రం 80 కేజీల బస్తాకు రూ.10 వేలు ఇచ్చేందుకు యజమానులు అంగీకరించారంటూ సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం చేపట్టారు. అంతలోనే తమ వ్యాపారాలు సరిగా సాగడం లేదని, ఆర్థికమాంద్యం ప్రభావంతో అమ్మకాలు పడిపోయాయంటూ బంద్ నాటకానికి వ్యాపారులు తెర తీశారు. పరిశ్రమల బంద్‌తో పిక్కలు కొనుగోలు చేయాల్సిన పని ఉండదని, రైతులు వారంతట వారే తక్కువ ధరకు ఇచ్చేస్తారని బంద్ మంత్రం పాటిస్తున్నారన్న చర్చ పలాస ప్రాంతంలో నడుస్తోంది. జీడి పిక్కలకు ప్రభుత్వం నుంచి అదనంగా రూ.వెయ్యి ఇస్తామని మంత్రి సీదిరి అప్పలరాజు 2019లో రైతులకు హామీనిచ్చారు.

అదే అంశంపై ఇటీవల పలాసలో నిర్వహించిన బహిరంగ సభలో ఎంపీ రామ్మోహన్ నాయుడు రూ.వెయ్యి హామీ ఏమైందని ప్రశ్నించారు. మంత్రి ఇచ్చిన హామీని గుర్తు చేసిన ఎంపీ తాము అధికారంలోకి వస్తే జీడి కొనుగోళ్లు, మద్దతు ధరపై ఏం చేస్తారో చెప్పలేదు. రాజకీయంగా మంత్రిని ఇరకాటంలో పెట్టే ప్రయత్నమే తప్ప రైతులకు మేలు చేసే విషయంలో చిత్తశుద్ధి కొరవడినట్లుగా కనిపిస్తోంది.


మాట్లాడుతున్న స్పీకర్ సీతారాం

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

శాసనసభ స్పీకర్ సీతారాం

ప్రజాశక్తి- పొందూరు

అర్హతే ప్రామాణికంగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు అందజేస్తున్నారని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని కృష్ణాపురంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా సమస్యల పరిష్కారానికి ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధి ఏ మేరకు చేకూరుతుందో ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి లోలుగు కాంతారావు, మాజీ సర్పంచ్ గార రమణ, పిఎసిఎస్ అధ్యక్షులు కొంచాడ రమణమూర్తి, ఎఎంసి చైర్మన్ బాడాన సునీల్‌కుమార్, వైసిపి మండల అధ్యక్షులు కొంచాడ రమణమూర్తి పాల్గొన్నారు.


బ్యాటింగ్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే లక్ష్మీదేవి

క్రికెట్ లీగ్ మ్యాచ్ ప్రారంభం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

శ్రీకాకుళం నియోజకవర్గం పరిధిలోని గేదెలవానిపేటలో నవీన్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌ను మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత క్రీడల్లో రాణించాలని పిలుపునిచ్చారు. జాతీయ, అంతర్జాతీయ ఖ్యాతిని పొందిన క్రీడాకారులు జిల్లాలో ఉన్నారని, వారిని స్ఫూర్తిగా తీసుకుని క్రమశిక్షణతో ముందడుగు వేయాలని సూచించారు. కార్యక్రమంలో టిడిపి నగర బిసి విభాగం అధ్యక్షులు ఉంగటి రమణ, మాజీ కౌన్సిలర్లు విశ్వనాథం, రామచంద్ర, కమిటీ సభ్యులు మధుసూదన్, శ్యామలరావు, నరేంద్ర, సురేష్, శ్రీను, సింహాచలం, ఉమ, కుంచాల కాంతారావు, తిరుపతిరావు పాల్గొన్నారు.

ఒబిసిలో చేర్చేందుకు ప్రభుత్వం సహకరించాలి

కోటబొమ్మాళి : కళింగ వైశ్య, శిష్టకరణ, సొండి, అరవల తరగతులను ఒబిసిలో చేర్పించేందుకు ప్రభుత్వం సహకరించాలని సాధికారిత కమిటీ రాష్ట్ర కన్వీనర్ బోయిన గోవిందరాజులు కోరారు. స్థానిక టిడిపి కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. నాలుగు తరగతులకు సంబంధించి, సాంఘిక, ఆర్థిక స్థితిగతులపై వెంటనే జాతీయ బిసి కమిషనర్‌కు, ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ జవహర్‌రెడ్డికి ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు లేఖ రాశారని అన్నారు. దీనిపై హర్షం వ్యక్తం చేశారు. ఈయనతో పాటు మాజీ ఎంపిపి తర్ర రామకృష్ణ, మాజీ సర్పంచ్ శిమ్మ నారాయణరావు ఉన్నారు.

కొండలు కరిగి... కంకర తరలి

- యథేచ్ఛగా తవ్వకాలు
- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి- పలాస

పలాస-కాశీబుగ్గ జంట పట్టణాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో కంకర మాఫియా రోజురోజుకూ పెచ్చుమీరుతోంది. కొండలు అమాంతంగా కరిగిపోగా కంకర అనధికారికంగా తరలిపోతుంది. బహిరంగంగా, ఇష్టానుసారంగా కంకర తవ్వకాలు చేపట్టి, కొండలను కరిగేస్తున్నారు. ట్రాక్టర్లతో రాత్రి, పగలు తేడాలేకుండా కంకర తరలిస్తున్నా అధికారులు తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వానికి చెల్లించాల్సిన రుసుం చెల్లించకపోవడంతో భారీగా ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది. పలాస మండలంలోని నెమలికొండ, కాశీబుగ్గ ప్రాంతాల్లో ప్రభుత్వ కొండలను భారీ యంత్రాలతో తవ్వి పిండి చేస్తున్నారు. రూ.లక్షలు విలువచేసే కంకరను తరలిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వాస్తవానికి ప్రభుత్వ స్థలాలు, కొండ ప్రాంతాల్లో కంకర తవ్వకాలు చేపట్టాలంటే ముందస్తుగా రెవెన్యూ, మైన్స్ అధికారుల నుంచి అనుమతి పొందాలి. ప్రభుత్వానికి చలానా రూపంలో డబ్బులు చెల్లించాలి. కానీ, కంకర మాఫియా ఇష్టానుసారంగా తవ్వకాలు చేపట్టి రూ.లక్షలు సొమ్ము చేసుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అది ప్రభుత్వానికి, ఇటు అధికారుల నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా డబ్బులు చెల్లించకుండా ఇష్టానుసారంగా కంకర తవ్వకాలు చేపడుతున్నా అధికారులు చోద్యం చూస్తున్నారే తప్ప ఎటువంటి చర్యలు చేపట్టడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. హుదూద్ నివాసగృహాల వెనకవైపు భారీ యంత్రాలతో పట్టపగలే తవ్వకాలు చేపడుతున్నారు. పలాస మండలం రామకృష్ణాపురం, నీలిభద్ర, కొండ ప్రాంతాల్లో జోరుగా కంకర తవ్వకాలు చేపడుతున్నారు. రోజుకు వంద లోడులు వరకు కంకర తరలిస్తున్నట్లు తెలుస్తోంది. ఒక లోడు కంకర రూ.600 నుంచి రూ.800 వరకు ధర పలుకుతోంది. ఈ విధంగా రోజుకు రూ.లక్ష వరకు ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది. ఎక్కువగా పట్టణ ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణానికి రాత్రి, పగలు తేడా లేకుండా కంకర తరలించేందుకు ముందుగా రూ.లక్షల్లో బేరం కుదుర్చుకుంటున్నారు. అనుకున్న సమయానికి అక్రమంగా కంకర తరలించి, కంకర మాఫియా సొమ్ము చేసుకుంటున్నారే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటీవల రియల్ ఎస్టేట్ జోరుగా


రామకృష్ణాపురంలో కరిగిన కొండ

సాగుతుండడంతో పంట భూములను లేఅవుట్లుగా మార్చే ప్రాంతాల్లో మట్టితో పాటు కంకర తరలిస్తున్నట్లు తెలిసింది. ఏదేమైనప్పటికీ ప్రభుత్వానికి చేరాల్సిన ఆదాయం కంకర మాఫియా చేతుల్లోకి వెళ్లిపోతుందని, తవ్వకాలు నివారించేందుకు అధికారులు చర్యలు చేపట్టకపోవడం వల్లే ఇటువంటి పరిస్థితులు నెలకొంది. ఎవరైనా ఫిర్యాదు చేస్తే తూతూమంత్రంగా ఆయా ప్రాంతాలను సందర్శించి, చేతులు దులుపుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు దృష్టి సారించి కంకర అక్రమంగా తరలిపోకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

జిల్లా అభివృద్ధి ప్రదాత రాజగోపాలరావు

రెవెన్యూ మంత్రి ప్రసాదరావు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

వందేళ్ల క్రితం వెనకబడిన, మారుమూల జిల్లాగా ఉండే శ్రీకాకుళం జిల్లా పేరు ప్రఖ్యాతులను ఢిల్లీ వరకు తీసుకువెళ్లిన గొప్ప వ్యక్తి కీర్తిశేషులు బొద్దేపల్లి రాజగోపాలరావుకే సొంతమని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. స్థానిక మండల కార్యాలయం ఎదురుగా ఏర్పాటు చేసిన మాజీ ఎంపీ రాజగోపాలరావు విగ్రహాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా శాశ్వత అభివృద్ధి ప్రదాత రాజగోపాలరావు అభివర్ణించారు. ఆమదాలవలసకు చెక్కర కర్మాగారం తీసుకొచ్చి ఎందరెందరికో నిరుద్యోగులకు, రైతులకు ఉపాధి కల్పించారని అన్నారు. వంశధార ప్రాజెక్టు ద్వారా వ్యవసాయానికి నీరందించి అపర భగీరథునిగా పేరు ప్రఖ్యాతులతో జన హృదయంలో చిరస్థాయిగా నిలిచారని అన్నారు. రాగోలులో కృషి విజ్ఞాన్ కేంద్రాన్ని తెచ్చిన ఘనత


విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి ధర్మాన

ఆయనకే సొంతమన్నారు. పశు సంవర్ధక శాఖ మంత్రి సిదిరి అప్పలరాజు మాట్లాడుతూ జిల్లా అభివృద్ధికి రాజగోపాలరావు కృషి చేశారని అన్నారు. కార్యక్రమంలో కాళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్, వైసిపి జిల్లా అధ్యక్షులు, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, ఎమ్మెల్సీ నర్తు రామారావు, కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి, పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి, ఆమదాలవలస మాజీ ఎమ్మెల్యే బొడ్డేపల్లి సత్యవతి, టెక్కలి జెడ్‌పిటిసి దువ్వాడ వాణి, సంపతిరావు హేసుందరరాజు పాల్గొన్నారు.


ఇళ్ల పట్టాలను అందజేస్తున్న రాజ్యలక్ష్మి

ఇళ్ల పట్టాల పంపిణీ

ఇచ్ఛాపురం : మున్సిపాలిటీ పరిధిలోని అర్హులైన ప్రతిఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తున్నామని చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి అన్నారు. ఇందులో భాగంగా 14, 15 వార్డులకు చెందిన 13 మంది లబ్ధిదారులకు జగనన్న ఇళ్ల పట్టాలను శనివారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లబ్ధిదారులకు రత్తకన్న లే అవుట్-5, కొలిగాం రోడ్డు వద్ద స్థలాలను కేటాయించామన్నారు. ప్రభుత్వం అందజేస్తున్న డబ్బులతో ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించాలన్నారు. 14వ వార్డు కౌన్సిలర్ నీలాపు లక్ష్మి, కౌన్సిలర్ ప్రతినిధులు నీలాపు ఢిల్లీ, పిలక విజయ భాస్కరరావు, రామ్‌జీ, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

ఇకెవైసి నమోదు తప్పనిసరి

టెక్కలి : టెక్కలి, సంతబొమ్మాళి మండలాల టెక్కలి సబ్‌ట్రెజరీ పరిధిలోని విశ్రాంత ఉద్యోగులందరూ ఇకెవైసి, ఆధార్ అనుసంధానం, పాన్ కార్డుతో లింకేజీ వంటి నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని విశ్రాంత ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షులు రోణంకి రామచంద్రరావు అన్నారు. సంఘ కార్యాలయంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీనియర్ సిటిజన్లకు వర్తించే ఇన్‌కంట్యాంక్స్ వివరాలు నమోదు చేయించే బాధ్యత సంఘ పరంగా చేపట్టనున్నామని తెలిపారు. సమావేశంలో విశ్రాంత ఉద్యోగుల సంఘ కార్యదర్శి కుర్మాన ధనుంజయరావు, గౌరవ అధ్యక్షులు గుజ్జు వెంకటరెడ్డి, దూసి ఆంధ్రాస్టాలిన్, కోరాడ మోహనరావు, వల్లభ మల్లయ్య, ఉప్పాడ దర్మారావు, హనుమంతు నాగేశ్వరరావు, కుప్పిలి కామేశ్వరరావు పాల్గొన్నారు.

27న మాలల ఆత్మీయ సమ్మేళనం

శ్రీకాకుళం అర్బన్ : మంగళగిరి టిడిపి కేంద్ర కార్యాలయంలో ఈ నెల 27న మాలల ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు ఎస్‌సి సెల్ జిల్లా అధ్యక్షులు మట్టా పురుషోత్తం తెలిపారు. నగరంలోని టిడిపి జిల్లా కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. ఈ సమ్మేళానికి టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు హాజరు కానున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 26 జిల్లాల మాలల ప్రతినిధులు ఈ సమ్మేళనంలో పాల్గొంటారని అన్నారు. జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో మాలల ప్రతినిధులు హాజరుకావాలని కోరారు. ఈయన వెంట ఎస్‌సి సెల్ ప్రధాన కార్యదర్శి గోర సురేష్, జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు పి.ఎం.జె.బాబు, రాష్ట్ర కార్యదర్శి బోనెల అప్పారావు ఎస్‌సి సెల్ అధికార ప్రతినిధి లింగాల రాజయ్య, వెంకటరావు, రాజు ఉన్నారు.

వ్యక్తి బలవన్మరణం

కొత్తూరు : స్థానిక రెల్లివీధికి చెందిన శ్రీరామ రాము (32) ఇంట్లో దూలానికి చున్నీతో శనివారం ఉరి వేసుకొని ఆత్మహత్య పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మృతుడి భార్య నవీన తాగునీటి కోసం కుళాయి వద్దకు వచ్చింది. నీరు పట్టుకుని తిరిగి వెళ్లి చూడగా... భర్త దూలానికి ఏలాడుతూ కనిపించాడు. గుండెలవిసేలా రోదిస్తూ... ఇరుగు, పొరుగు సహాయంతో కిందకు దించారు. హుటాహుటిన స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లారు. వైద్యులు పరీక్షించగా... అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. అనంతరం వైద్యులు పోలీసులకు సమాచారం అందజేశారు. పోలీసులు శవపంచనామా నిర్వహించి పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండకు తరలించారు. ఆర్‌టిసి కాంప్లెక్స్‌లో కళాసీగా పనిచేస్తూ... కుటుంబాన్ని పోషిస్తున్నాడు. మృతుడి కుమార్తె రజస్వల శుభకార్యం కోసం రెండు, మూడు రోజుల నుంచి మృతుడు రాము రుణం కోసం కొంతమంది వద్దకు వెళ్లాడని, వారు నిరాకరించడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడ్డాడని భార్య నవీన్ తెలిపారు. మృతుడికి కుమారుడు ధనస్సు, కుమార్తె లాస్య ఉన్నారు. దీంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. భార్య ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఎం.గోవింద్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.



హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసిన కార్యదర్శి

బోరుభద్ర లేఅవుట్‌లో బోర్డు ఏర్పాటు

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

మండలంలోని 'బోరుభద్రలో అక్రమ లే అవుట్' అనే కథనం ఈ నెల 21న ప్రజాశక్తిలో ప్రచురితమైంది. ఈ కథనానికి బోరుభద్ర పంచాయతీ కార్యదర్శి కె.వినోద్, సుడా అధికారి వెంకటేష్ బోరుభద్ర లేఅవుట్‌ను పరిశీలించారు. ఈ లేఅవుట్‌కు పంచాయతీ నుంచి గానీ సుడా నుంచి గానీ ఎటువంటి అనుమతులు లేవని గుర్తించారు. ఇక్కడ ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు ఇవ్వమని, ఇంకా ఎటువంటి సమాచారం కావాలన్నా పంచాయతీ కార్యదర్శిని సంప్రదించాలని కోరుతూ హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ఈ లేఅవుట్ బోరుభద్ర రెవెన్యూ పరిధిలో సర్వే నంబరు 126-2,3,4 లో ఎకరా 56 సెంట్లలో వేశారు.


'ఎన్ఇఆర్'తో మాట్లాడుతున్న కార్మికులు

'ఎన్ఇఆర్'ని కలిసిన యుబి కార్మికులు

రణస్థలం రూరల్: తమ సమస్యలు పరిష్కరించాలని మండలంలోని బంటుపల్లి పంచాయతీ పరిధిలోని యునైటెడ్ బెవరీస్ (బీరు) పరిశ్రమ కార్మికులు బిజెపి ఎచ్చెర్ల నియోజకవర్గం కన్వీనర్, సర్పంచ్ ప్రతినిధి నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్ఇఆర్)ని కలిశారు. నడుకుదిటిపాలెం తన క్యాంప్‌స్‌లో శనివారం సమస్యలతో కూడిన వినతిపత్రం అందించారు. ఎన్ఇఆర్ స్పందించి యుబి పరిశ్రమ ప్రతినిధులతో ఫోన్ మాట్లాడారు. కార్మికులందరికీ కనీస పని దినాలు కల్పించాలని కోరారు. దీనికి పరిశ్రమ యాజమాన్య ప్రతినిధులు సానుకూలంగా స్పందించిన సోమవారం నుంచి విధులలో చేరాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ అమ్మన్నాయుడు, స్థానిక ఎంపిటిసి టొంపల సంజీవి, ఎంపిటిసి మాజీ సభ్యులు గురాల రఘునాథ్, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఇజ్జు నారాయణరావు, జాక గంగయ్య పాల్గొన్నారు.


బోరును ప్రారంభిస్తున్న సర్పంచ్ పోలినాయుడు

శ్మశానవాటికలో బోరు ఏర్పాటు

పొందూరు: మండలంలోని పిల్లలవలసలో శ్మశానవాటికలో ఏర్పాటు చేసిన తాగునీటి బోరును శనివారం సర్పంచ్ బుడుమూరు పోలినాయుడు ప్రారంభిం చారు. 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.లక్షలతో ఈ బోరును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రామంలో దహన సంస్కారాల సమయంలో ఈ తాగునీటి బోరు ప్రజలకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. తాగునీటి బోరు ఏర్పాటు చేయడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఇన్వర్టర్ అందజేత

శ్రీకాకుళం అర్బన్ : నగరంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో ఉన్న బెహరా మనోవికాస కేంద్రానికి బత్తుల కుసుమాంబ జ్ఞాపకార్థం ఆమె కుటుంబ సభ్యులు రూ.18 వేలు విలువ గల ఇన్వర్టరును అందజేశారు. ఆమె కుటుంబ సభ్యులు ఈ కేంద్రాన్ని శనివారం సందర్శించి అక్కడున్న మానసిక వికలాంగులకు తమ వంతు సహకారం అందించారు. కుమార్తెలు కృష్ణవేణి, శారద, భవాని, విజయ, కోడలు విజయలక్ష్మి పాల్గొన్నారు.

గొండు శంకర్ పరామర్శ

శ్రీకాకుళం అర్బన్ : యువతను మత్తుకు బానిసలుగా ప్రభుత్వం మార్చి నేరాలకు పరోక్షంగా సహకరిస్తుందని సర్పంచ్‌ల సంఘ జిల్లా అధ్యక్షులు గొండు శంకర్ విమర్శించారు. నగరంలోని దమ్మలవీధిలో ఇటీవల మాజీ కౌన్సిలర్ కేశవ రాంబాబుపై దుండగులు గంజాయి మత్తులో దాడి చేయడంతో గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న శంకర్ స్వగృహానికి శనివారం రాంబాబును పరామర్శించారు. యువత గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు.


పరామర్శిస్తున్న గొండు శంకర్

శ్రమదానంతో కాలిబాట వంతెన నిర్మాణం


రైతులతో మాట్లాడుతున్న రాజు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మండలంలోని బూర్జిపాడు రైతులకు అవసరమైన బాహుదా నది పిల్ల కాలువ కలినడక వంతెన సొంత నిధులతో స్వయంగా నిర్మించుకున్నారు. దీంతో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి దాసరి రాజు రైతులకు అభినందనలు తెలిపారు. వంతెన నిర్మాణానికి రూ.5 లక్షల వరకు నిధులు వసూలు చేశారు. ఇందులో జన సైనికులు రూ.3.50 లక్షలు రైతులకు ఆర్థికసాయం అందజేశారు. ఏళ్ల తరబడి కాలిబాట వంతెన నిర్మించాలని రైతులు స్థానిక నాయకులకు, అధికారులకు కోరారు. రైతుల మొరను ఎవరూ పట్టించుకోలేదు. రైతులు, స్థానికులు ఎన్నో ఇబ్బందులు, కష్టాలు పడుతూ నెట్టికొచ్చారు. కాలువకు అటువైపు 400 ఎకరాలకు సాగు చేసుకోవడానికి రైతులు ఇబ్బందులు పడుతుండేవారు. దీంతో ఎవరూ పట్టించుకపోవడంతో బూర్జిపాడు రైతులు, జనసేన నాయకులు వంతెన నిర్మాణానికి ముందుకొచ్చారు. రైతులకు జనసేన నాయకులు చేదోడు, వాదోడుగా ఉంటూ ఈ నిర్మాణం పూర్తి చేశారు. ప్రభుత్వాలు చేయాల్సిన పనులు ప్రజలే తమ సొంత నిధులతో వంతెన నిర్మించుకోవడం సిగ్గుచేటని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొని ఇలాంటి పనుల్లో అలసత్వం వహించకుండా ముందు అడుగు వేయాలని కోరారు. కార్యక్రమంలో బూర్జపాడు డొంకూరు జనసైనికులు, రైతులు పాల్గొన్నారు.

ఒడియా పాఠశాల తనిఖీ

కవిటి : డిఇఒ ఆదేశాల మేరకు కవిటి జిల్లా పరిషత్ ఒడియా ఉన్నత పాఠశాలను డిప్యూటీ డిఇఒ పగడాలమ్మ శనివారం తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా పాఠశాల పరిసరాలు పరిశీలించి ఉపాధ్యాయులతో సమీక్షించారు. ఈ సందర్భంగా పాఠశాలలో పనిచేస్తున్న ఒక ఉపాధ్యాయుని పనితీరు బాగులేదని, విద్యార్థులతో ఆయన మసులుకునే విధానం కూడా సక్రమంగా లేదని కంద్రకుల సంక్షేమ సంఘం, విద్యార్థుల తల్లిదండ్రుల సంతకాలతో కొంత మంది ఫిర్యాదు చేశారని అన్నారు. దీనిపై సంబంధిత ఉపాధ్యాయుడు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడితో మాట్లాడి పూర్తి వివరాలతో కూడిన నివేదికను సోమవారం డిఇఒకి అందజేస్తానని తెలిపారు. అనంతరం


ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న పగడాలమ్మ

మాణిక్యపురం పాఠశాలలను ఆమె సందర్శించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రికార్డులు పరిశీలించి, ఉపాధ్యాయులతో సమావేశమై వార్షిక ప్రణాళికలపై సూచనలు చేశారు. మధ్యాహ్న భోజన పథకం, బై జ్యూస్ ట్యాబ్‌ల వినియోగం, నాడు-నేడు పనుల వేగవంతంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఇఒ ధనుంజయ మజ్జి, సర్పంచ్ పూడి లక్ష్మణరావు, ఎంపిటిసి పూడి నీలాచలం, సిఆర్‌పి తనూజ ఉన్నారు.


ఆమదాలవలస : విత్తనాలను పంపిణీ చేస్తున్న సర్పంచ్ వాణిశ్రీ

విత్తనాల పంపిణీ

ప్రజాశక్తి- ఆమదాలవలస

రైతు శ్రేయస్సే ప్రభుత్వ ధ్యేయమని సర్పంచ్ తమ్మినేని వాణిశ్రీ అన్నారు. మండలంలోని తొగరాంలో ఉన్న రైతు భరోసా కేంద్రం వద్ద రైతులకు రాయితీతో కూడిన విత్తనాలను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి వ్యవసాయ రంగానికి పెద్దపీట వేశారని అన్నారు. రైతులకు అండగా ఉండేందుకే రైతు భరోసా పథకాన్ని ప్రవేశపెట్టారని తెలిపారు. గతంలో విత్తనాల కోసం మార్కెట్ కమిటీలు, సొసైటీలు చుట్టూ తిరిగే రోజులు పోయి రైతు చెంతకే ప్రస్తుతం విత్తనాలు వచ్చే పరిస్థితి వచ్చిందని అన్నారు. రైతు భరోసా కేంద్రంలో ఎంటియు 1061, 7029, 1064, 1121, బిపిటి 5204 వంటి రకాల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, రైతులకు కావాల్సిన విత్తనాలను తీసుకొని వెళ్లి సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి తమ్మినేని శ్రీరామ్మూర్తి, మండల సచివాలయాల కో-ఆర్డినేటర్ బొడ్డేపల్లి నిరంజన్‌బాబు, వ్యవసాయ అధికారి మెట్ట మోహనరావు పాల్గొన్నారు.

రణస్థలం రూరల్ : మండలంలోని పిసిని పంచాయతీ పతివడపాలెం రైతు భరోసా కేంద్రంలో ఎంపిపి ప్రతినిధి పిన్నింటి సాయికుమార్ వరి విత్తనాలను అందజేశారు. ఎంటియు 1121, బిపిటి 3291 మొత్తం 240 బస్తాలు పిసిని పంచాయతీలో పంపిణీకి అందుబాటులో ఉన్నాయని అన్నారు. కార్యక్రమంలో ఎడిఎ వడ్డాది శ్రీనివాసరావు, ఎఒ డి.విజయభాస్కర్, సర్పంచ్ రెడ్డి విశ్వేశ్వరరావు, ఎంపిటిసి ప్రతినిధి పతివాడ సత్యం, నెలివాడ సర్పంచ్ శ్రీరామ్మూర్తి, పైడి శ్రీనివాసరావు, దన్నాన శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఓటర్ల నమోదు

ప్రజాశక్తి- లావేరు

ఓటర్ల నమోదుకు తొలగింపుల్లో ఎటువంటి తప్పిదాలకు, పొరపాటులకు తావు ఇచ్చినా అందుకు పూర్తి బాధ్యులు బిఎల్‌ఒలేనని డిఆర్‌ఒ ఆర్‌డిఒ మురళీకృష్ణ అన్నారు. స్థానిక వెలుగు సమావేశ మందిరంలో బిఎల్‌ఒలతో, సూపర్‌వైజర్లతో, విఆర్‌ఒలతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమావేశానికి రాని బిఎల్‌ఒలకు సంజాయిషీ నోటీసు అందజేయాలని తహశీల్దార్‌కు ఆదేశించారు. మరో 11 నెలల్లో ఎన్నికలు రానున్నాయని, ఓటర్లు నమోదు, తొలగింపులు ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వాలంటీర్లు, వారి కుటుంబ సభ్యుల ప్రమేయం ఉండకూడదని చెప్పారు. వచ్చే అక్టోబరు నాటికి ఓటర్ల జాబితాలు అప్‌లోడ్ చేపట్టాలన్నారు. ఓటర్ల నుంచి ఫిర్యాదులు వస్తే బిఎల్‌ఒలను సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. మృతి చెందిన వారి పేర్లను, పెళ్లయిన మహిళల పేర్లను ఓటర్ల జాబితాలో నుంచి తొలగించాలన్నారు. అలాగే అన్ని రాజకీయ పార్టీ నాయకులతో గ్రామసభలు నిర్వహించి వారి సంతకాలు తీసుకోవాలన్నారు. తహశీల్దార్ దిలీప్ చక్రవర్తి మాట్లాడుతూ ఓటర్ల నమోదుకు ఆన్‌లైన్‌లో జరిగేలా ప్రోత్సాహించాలని చెప్పారు. మండలంలో వందేళ్లు దాటిన వారు 14 మంది ఉన్నట్లుగా సమాచారం ఉందని, అవి పరిశీలించాలని ఆదేశించారు. ఇంటి నెంబర్లులేని ఓటర్లు 471 మంది ఉన్నారని, అవీ క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. సమావేశంలో డిటి నారాయణమూర్తి, ఎన్నికల డిటి డి.వి.శ్రీనివాసరావు, ఆర్ఐ బాలు, సీనియర్ సహాయకులు రత్నకుమార్ పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు: ఓటరు నమోదుపై అవగాహన కలిగించాలని ఆర్‌డిఒ టి.సీతారామ్మూర్తి అన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో బిఎల్‌ఒలతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన


మాట్లాడుతున్న డిఆర్‌ఒ మురళీకృష్ణ

ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు కావాలని సూచించారు. సమావేశంలో తహశీల్దార్ బి.అప్పలస్వామి, డిటి వాయలపల్లి గిరిరాజ్ పాల్గొన్నారు.

జలుమూరు : అర్హులైన ప్రతిఒక్కరికీ ఓటు హక్కు ఉండేలా చూడాలని నరసన్నపేట నియోజకవర్గ ఓటర్ల రిజిస్ట్రేషన్ నమోదు అధికారి జయదేవి అన్నారు. తహశీల్దార్ కార్యాలయంలో బూత్ లెవెల్ అధికారులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒకే వ్యక్తికి రెండు చోట్ల ఓటు హక్కు ఉంటే తొలగించాలని సూచించారు. బూత్ లెవెల్ అధికారులు కచ్చితమైన ఓటర్ జాబితా సిద్ధం చేయాలన్నారు. సమావేశంలో తహశీల్దార్ బి.సత్యం, విఎల్‌ఒలు పాల్గొన్నారు.

విద్యుత్ ఛార్జీలు తగ్గించాలి

ప్రజాశక్తి- పలాస

ప్రభుత్వం ట్రూ ఆఫ్ ఛార్జీలు, సర్ ఛార్జీల పేరుతో పెంచిన విద్యుత్ ఛార్జీలను తక్షణమే తగ్గించాలని సిపిఎం నాయకులు ఎన్.గణపతి డిమాండ్ చేశారు. కాశీబుగ్గ పాత బస్టాండ్ గాంధీ విగ్రహం వద్ద వామపక్షాల ఆధ్వర్యాన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మోడీ తల్లొగ్గి రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై భారాలు మోపడం సరైన పద్ధతి కాదన్నారు. విద్యుత్ ఛార్జీలు పెరగడం వల్ల వినియోగదారులపై భారం పడుతుందన్నారు. 2014-19 ఏడాదిలో ప్రభుత్వం ఇవ్వాల్సిన సబ్సిడీ చెల్లించకుండా ప్రజలపై ట్రూ ఆఫ్ ఛార్జీల పేరుతో వసూళ్లు చేయడం దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పెంచిన విద్యుత్ ఛార్జీలు వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 30న విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ధర్నా



ధర్నా చేస్తున్న వామపక్ష నాయకులు

చేపడతామని, దీనిని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు సిహెచ్.వెంకటరమణ, సిపిఐఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు వంకల మాధవరావు, సిపిఐఎంఎల్ లిబరేషన్ నాయకులు కుత్తుము దుశ్యంత్, వివిధ పార్టీల నాయకులు వి.కృష్ణారావు, డి.కిషోర్, ఎ.వీరాస్వామి, ఎన్.ఢిల్లేశ్వరి, జె.భాగ్యలక్ష్మి, జుత్తు వీరాస్వామి, ఎం.తాతారావు, వంకల ముకుందరావు, ఎం.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మూలకు చేరిన సుజల స్రవంతి

పొందూరు: మండలంలోని కింతలిలో ఎన్‌టిఆర్ సుజల స్రవంతి పథకం ద్వారా ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను పునరుద్ధరించి వినియోగంలోకి తీసుకురావాలని కింతలి గ్రామస్తులు కోరుతున్నారు. ఈ వాటర్ ప్లాంట్ ద్వారా కేవలం రూ.5లకే స్వచ్ఛమైన తాగునీరును అందిస్తుండేవారని పేర్కొన్నారు. ఈ ప్లాంట్ మరమ్మతులకు గురి కావడంతో తాగునీటికి కింతలితో పాటు పరిసర గ్రామ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాటర్ ప్లాంట్‌కు తక్షణమే మరమ్మతులు చేసి త్వరితగతిని తాగునీటి పంపిణీ కార్యక్రమాన్ని పునరుద్ధరించాలని కోరుతున్నారు. దీనిపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి స్వచ్ఛమైన తాగునీటి సరఫరాకు కృషి చేయాలని కోరారు.



మూతపడిన వాటర్‌ప్లాంట్


పోలాకి : అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి శ్రీధర్

స్పర్శ-కుష్టుపై అవగాహన

పోలాకి : కుష్టు వ్యాధి సామాజిక కలంకమని, సకాలంలో చికిత్స చేసుకోవడం ద్వారా ఈ వ్యాధి పూర్తిగా నయమవుతుందని పోలకి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి శ్రీనాథ్ అన్నారు. ఈ మేరకు పోలాకిలో స్పర్శ-కుష్టుపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇలాంటి అవగాహనా కార్యక్రమాలు మారుమూల ప్రాంతాల్లో అవసరమని చెప్పారు. ఎంఐపి మైకో బాక్టీరియం ఇండికస్ ప్రాణి అనే ప్రొఫైలక్టిక్, తెరపిటిక్ వ్యాక్సిన్‌ను కొత్తగా రానుందని అన్నారు. కుష్టు వ్యాధి మైకో బాక్టీరియా లెప్రే వల్ల కలుగునని స్పర్శ జ్ఞానం లేని రాగిరంగు నూనెవలె మెరిసే మచ్చలు కను బొమ్మలు రాలి పోవడం, ముక్కు నుంచి రక్తం కారడం వంటి లక్షణాలు ఈ వ్యాధిలో ఉంటాయని అన్నారు. ఈ వ్యాధి వల్ల కలుగు దుష్ప్రభావాలు, వ్యాధి చికిత్స, మైక్రో సెల్యూలర్ రబ్బర్ చెప్పులు తదితర అంశాలను కూలంకషంగా వివరించారు. ఈనెల 26 నుంచి వచ్చే 16 వరకు ఆశా కార్యకర్తలు, వాలంటీర్లు కుష్టు వ్యాధి లక్షణాలు గల వ్యక్తులను గుర్తించి వారిని పిహెచ్‌కి తరలించి సరైన చికిత్స అందేటట్లు చేస్తామన్నారు. రవికుమార్, ఈశ్వరమ్మ, పిహెచ్ఎన్ శేఖర్‌బాబు, లక్ష్మి పాల్గొన్నారు.

జలుమూరు: ఈ నెల 26 నుంచి ఎల్‌సిడిసి సర్వే నిర్వహించాలని జలుమూరు పిహెచ్‌సి వైద్యాధికారి చల్ల వంశి తెలిపారు. ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సర్వే చేపట్టి అనుమానాస్పద కేసులు ఉంటే పిహెచ్‌సికి వివరాలు అందజేయాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది ఎస్.పద్మావతి, చిన్న రాజులు పాల్గొన్నారు.

మెళియాపుట్టి : స్థానిక పిహెచ్‌సి పరిధిలో సర్వే చేపట్టి అనుమానాస్పద కేసులు ఉంటే పిహెచ్‌కి వివరాలు అందజేయాలని వైద్యాధికారి అలేఖ్య సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు, హెల్త్ వర్కర్లు పాల్గొన్నారు.



జ్ఞాపికను అందజేస్తున్న ఇఒ హరి సూర్యప్రకాష్

అరసవల్లి సందర్శన

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

మహారాష్ట్రలోని ముంబై సౌత్ ఈస్ట్ లోక్‌సభ సభ్యులు మనోజ్ కోటక్ శనివారం అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామి ఆలయాన్ని సందర్శించారు. ఆయనకు ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆలయ మర్యాదలతో స్వాగతించారు. ఆలయంలో స్వామివారికి పలు సేవలు నిర్వహించిన అనంతరం ఆలయ ప్రాంగణంలోని అనివేటి మండపంలో స్వామివారి శేష వస్త్రాన్ని కప్పి జ్ఞాపికను ఇఒ హరిసూర్యప్రకాష్ అందజేశారు. ఆయన వెంట బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూర్యనారాయణరాజు, రాష్ట్ర యువ మోర్చ అధ్యక్షులు సురేంద్ర మోహన్, రాష్ట్ర ఉపాధ్యక్షులు పైడి వేణుగోపాలం, రాష్ట్ర కార్యదర్శి షవ్వాన ఉమామహేశ్వరి, రాష్ట్ర అధికార ప్రతినిధి పూడి తిరుపతిరావు ఉన్నారు.

కొత్తమ్మతల్లి...

కోటబొమ్మాళి: స్థానిక శ్రీకొత్తమ్మతల్లి అమ్మవారిని జిల్లా ఫ్యామిలి కోర్టు అదనపు జడ్జి పి.భాస్కరరావు, కోటబొమ్మాళి జూనియర్ కోర్టు జూనియర్ సివిల్ జడ్జి డి.భరణిలు శనివారం కొత్తమ్మతల్లిని దర్శించుకున్నారు. వీరికి ఆలయ సాంప్రదాయం ప్రకారం దేవాదయశాఖ కార్యనిర్వాహణాధికారి వాకచర్ల రాధాకృష్ణ స్వాగతం పలికారు.

సరిపడా విత్తనాలు సరఫరా చేయాలి

ప్రజాశక్తి- పలాస



మాట్లాడుతున్న మాధవరావు

ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావస్తున్న తరుణంలో రైతాంగానికి సరిపడా అన్ని రకాల విత్తనాలను ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా సరఫరా చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు డిమాండ్ చేశారు. కాశీబుగ్గ సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. విత్తనాలు బ్లాక్ మార్కెట్‌కు తరలిపోకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. బ్యాంకులో రైతులకు రుణ సౌకర్యాలు మంజూరు చేయాలన్నారు. పాడైన వంశధార కాలువకు మరమ్మతులు చేపట్టి శివారు భూములకు సాగునీరు అందేలా చర్యలు చేపట్టాలన్నారు. ఏటా శివారు భూములకు సాగునీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారని, ఆ పరిస్థితి రాకుండా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతుల కష్టాలను అటు ప్రభుత్వం, ఇటు అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రకృతి వైపరీత్యాలు, వర్షాల సకాలంలో పడకపోయినా మళ్లీ విత్తనాలు అందించడానికి కావాల్సిన విధంగా వ్యవసాయ అధికారులు ముందస్తుగా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. సమావేశంలో అఖిలభారత రైతుకూలీ సంఘం జిల్లా నాయకులు వంకల పాపయ్య, మురిపిండి తాతారావు, టి.దమయంతి, ఐఎఫ్‌టియు నాయకులు జుత్తు వీరాస్వామి, అరుణోదయ జిల్లా కార్యదర్శి కోసింటి సోమేశ్వరరావు, పిఒడబ్ల్యూ నాయకులు సరస్వతి, సుహాసిని, ఆనంద్ పాల్గొన్నారు.



బ్యాగును పరిశీలిస్తున్న ఎంఇఒ-2 చిన్నారావు

జెవికె కిట్లు పరిశీలన

నందిగాం : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ప్రభుత్వం అందించే జగనన్న విద్యాకానుక కిట్లను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఇఒ-2 అన్నుపురం చిన్నారావు అన్నారు. మండలంలోని లఖిదాసుపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలని శనివారం సందర్శించారు. విద్యార్థుల కిట్లను వినియోగిస్తున్నారా? లేదా? అన్నది పరిశీలించి విద్యార్థుల సామర్థ్యాన్ని పర్యవేక్షించారు. అనంతరం పాఠశాలలో చేపడుతున్న నాడు-నేడు పనులను పరిశీలించారు. ప్రధానోపాధ్యాయులు చిలుకు కృష్ణారావు పనుల పురోగతిని ఆయనకు వివరించారు. ఆనంతరం జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా విద్యార్థులకు అందించే రాగిజావని పరిశీలించారు. పాఠశాల ఉపాధ్యాయులు బాలక రామారావు, తులసీప్రసాద్, గోవిందరావు, బెందాళం రత్నం, రంకిడి రామారావు, ప్రియదర్శిని, యాగాటి త్రినాథరావు ఉన్నారు.

'జగనన్న సురక్ష'ను విజయవంతం చేయాలి

నందిగాం : జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జగనన్న సచివాలయ కన్వీనర్ల మండల ఇన్‌ఛార్జి జె.జయరాం పిలుపునిచ్చారు. మండలంలోని కొత్తగ్రహారం సచివాలయంలో జగనన్న సురక్ష విజయవంతంపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనివిధంగా ఇంటింటికీ వెళ్లి మరీ సమస్యలు ఏమైనా ఉంటే తెలుసుకొని, వాటి పరిష్కారం చూపించే దిశగా చేస్తున్న వినూత్న కార్యక్రమం జగనన్న సురక్ష అని అన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి వసంత్‌కుమార్. సర్పంచ్‌లు కింతల శేషగిరి, కూన శాంతారావు, సచివాలయ కన్వీనర్లు రోణంకి ఢిల్లి, గోవిందరావు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : పట్టణంలో 16, 17 వార్డులు లాలాపేట సచివాలయంలో జగనన్న సురక్ష విజయవంతంపై మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ భారతీ దివ్య అవగాహన కల్పించారు. కార్యక్రమంలో 17 వార్డు కౌన్సిలర్ ప్రతినిధి టెంక లోకేష్, ఎంఎల్‌ఒ సందీప్, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

మెళియాపుట్టి : మండలంలోని పట్టుపురం, శేఖరాపురం,



పలాస : మాట్లాడుతున్న కమిషనర్ నాగేంద్రకుమార్

దబ్బగూడ గ్రామాల్లో జిఎస్‌డబ్ల్యుఎస్ జిల్లా నోడల్ అధికారి పి.వాసుదేవరావు, టెక్కలి డిఎల్‌డిఒ అలివేలు మంగమ్మ సందర్శించారు. జగనన్న సురక్ష అనే కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో సందర్శించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ పి.చంద్రకుమారి, కార్యదర్శి ఢిలేశ్వరరావు పాల్గొన్నారు.

లావేరు : జగనన్న సురక్ష పథకంపై గ్రామాల్లోని ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపిడిఒ కె.సురేష్‌కుమార్ అన్నారు. అదపాక సచివాలయంలోని వాలంటీర్లకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ గొర్లె శశికళ, మాజీ సర్పంచ్ గొర్లె అప్పలనాయుడు, కార్యదర్శి జి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పలాస: రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన ప్రతి లబ్ధిదారులకూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందించేందుకు జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తుందని, జగనన్న సురక్ష కార్యక్రమంపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ నాగేంద్రకుమార్ సచివాలయం ఉద్యోగులకు హెచ్చరించారు. పలాస మున్సిపల్ కార్యాలయంలో సచివాలయం ఉద్యోగులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంటింటికీ వెళ్లి సర్వే చేయాలన్నారు. నిజమైన అర్హులకు పథకాలు అందకపోతే జగనన్న సురక్షలో మంజూరు చేస్తామని అన్నారు. జులై 4 నుంచి మున్సిపాలిటీ పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం ప్రారంభం అవుతుందని చెప్పారు. అప్పటి నుంచి ప్రతి రెండు వార్డుల్లో సేకరించిన దరఖాస్తులపై అక్కడికక్కడే పరిష్కరిస్తామని అన్నారు. సమావేశంలో సచివాలయం ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు గుర్తింపుకార్డులు

జలుమూరు: కౌలు రైతులు పంట సాగు హక్కు పత్రాలు పొందడం ద్వారా బహుళ ప్రయోజనాలు ఉన్నాయని అల్లాడ పిఎసిఎస్ అధ్యక్షుడు మొజ్జాడ శ్యామలరావు అన్నారు. అల్లాడలో రెవెన్యూ, వ్యవసాయ శాఖల ఉమ్మడి సమావేశం శనివారం నిర్వహించారు. ముందుగా కౌలు రైతులకు పంట సాగు హక్కు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కౌలు రైతులు పంట సాగు పత్రాలు పొందడం ద్వారా పండించిన ధాన్యానికి మద్దతు ధర, పంట ఇన్సూరెన్స్, ఇన్‌పుట్ సబ్సిడీ, బ్యాంకు లోన్లు, వ్యవసాయశాఖ ద్వారా ప్రభుత్వం అందించే పథకాల్లో సబ్సిడీ తదితర లాభాలు చేకూరుతాయన్నారు. పూర్తిగా భూమిలేని రైతులు కౌలుకు చేస్తే రైతు భరోసా పథకం కూడా వర్తిస్తుందన్నారు. అయితే భూ యజమాని కౌలుకు చేసిన రైతులకు 11 నెలల కాల పరిమితికి సమ్మతిని తెలియజేస్తూ దరఖాస్తు ఇవ్వాలని సూచించారు. అనంతరం రాయితీపై వరి విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. సమావేశంలో ఆయనతోపాటు మండల వ్యవసాయ అధికారి కే సురేష్, గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు ఉన్నారు.

పొందూరు: అర్హత కలిగిన ప్రతి కౌలు రైతుకూ గుర్తింపు కార్డులను ప్రభుత్వం అందజేస్తుందని తహశీల్దార్ ఎస్.రాంబాబు, రణస్థలం ఎడిఇ వి.శ్రీనివాసరావు అన్నారు. తహశీల్దార్ కార్యాలయంలో కౌలు రైతుల గుర్తింపు కార్డులపై విఆర్‌ఒలు, విఎఎలతో శనివారం సమీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కౌలు రైతులు గుర్తింపు కార్డులు పొందడం ద్వారా ప్రభుత్వం అందజేసే ప్రయోజనాలను పొందవచ్చునని, దీనిపై కౌలు రైతులకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి బెండి బాబ్జీ, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరి

ప్రజాశక్తి- పలాస

ప్రతి వాహనదారులూ ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని బ్రాహ్మణతర్ల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వైకుంఠరావు అన్నారు. మండలంలోని బ్రాహ్మణతర్ల ఉన్నత పాఠశాల ఆవరణలో భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ, లక్ష్మీపురం టోల్‌ప్లాజా సమక్షంలో పాఠశాలలోని జూనియర్ రెడ్‌క్రాస్ క్లబ్, జాతీయ హరిత దళ క్లబ్‌లు అధ్యక్షతన సడక్ సురక్ష జీవన రక్ష కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రహదారిపై ప్రయాణం చేసే సమయంలో తప్పనిసరిగా హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించాలన్నారు. సిగ్నల్స్‌ను అనుసరించి ప్రయాణం చేయాలన్నారు. పరిమిత వేగంతో వెళ్లడం ద్వారా ప్రాణాపాయం నుంచి బయటపడతామన్నారు. రహదారికి ఇరువైపులా



ప్రతిజ్ఞ చేస్తున్న ఉపాధ్యాయులు

మొక్కలు పెంచడం ద్వారా పచ్చదనంతో పాటు పరిశుభ్రంగా ఉండాలే తప్ప రహదారులు ఎర్రని రక్తపు మరకలుతో కాదని అన్నారు. అనంతరం రహదారి భద్రతపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో టోల్‌ప్లాజా మేనేజర్లు అనీష్, కిరణ్‌కుమార్, మోహనరావు, జూనియర్ రెడ్‌క్రాస్ నోడల్ అధికారి, ఎన్‌జిసి క్లస్టర్ కో-ఆర్డినేటర్ కొయ్యల శ్రీనివాసరావు పాల్గొన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న వెంకట రమణమూర్తి

బూరగాం సచివాలయం సందర్శన

టెక్కలి : జగనన్న సురక్షలో భాగంగా అర్హులైన ప్రతిఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందించాలనే ఉద్దేశంతో నిర్వహిస్తున్న ఇంటింటా సర్వే పక్కాగా ఉండాలని ఇన్‌ఛార్జి ఎంపిడిఒ హనుమంతు వెంకట రమణమూర్తి సూచించారు. మండలంలోని బూరగాం సచివాలయాన్ని శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటివరకు పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో చేపట్టిన సర్వే వివరాలపై సమీక్షించారు. ఇప్పటివరకు పథకాలు అందుతున్న వివరాలు, అర్హత ఉన్నా అందని వివరాలు సేకరించాలన్నారు. అనంతరం ఇంటింటా జరుగుతున్న సర్వేని పరిశీలించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పంచాయితీ సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.

రైతులందరికీ విత్తనాలు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఖరీఫ్ సీజన్‌లో రైతులందరికీ కావాల్సిన విత్తనాల సరఫరా సక్రమంగా పంపిణీ చేయాలని వ్యవసాయ సహాయ సంచాలకులు జగన్మోహనరావు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ వ్యవసాయ సహాయకులతో, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులతో శనివారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అందుబాటులో ఉండాలన్నారు. పిఎం కిసాన్ ఇకెవైసి నెలాఖరిలోగా పూర్తి చేయాలన్నారు. గ్రామసభలో కౌలు రైతులను గుర్తించి విఆర్‌ఒల సహాయంతో ఇంటికి వెళ్లి కౌలు కార్డులను సరఫరా చేయాలన్నారు. ఇప్పటివరకు ఖరీఫ్ సీజన్‌కు మండలంలో 727 క్వింటాళ్ల వరి విత్తనాలు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల ఎఒ పి.శ్రీదేవి పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న ఉద్యోగులు

రక్తదానానికి స్పందన

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

కరూర్ వైశ్య బ్యాంకు 107వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలోని కృష్ణా పార్కు సమీపంలో ఉన్న బ్యాంకు శాఖలో ఉద్యోగులు, లబ్ధిదారులు రక్తదానం చేశారు. ఈ శిబిరాన్ని రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బ్యాంకు ప్రారంభించిన 107 ఏళ్లు పూర్తి చేసుకుని ప్రజల్లో నమ్మకాన్ని సొంతం చేసుకుందన్నారు. బ్యాంకు ద్వారా ప్రజలకు నిరంతరాయంగా సేవలు అందుతున్నట్లు తెలిపారు. బ్యాంకు మేనేజర్ రత్న రాజేష్ చుండూరు మాట్లాడుతూ ఖాతాదారుల సహకారంతో మెరుగైన సేవలు అందిస్తున్నామని అన్నారు. ఈ మేరకు 107 మంది రక్తదానం చేశారు.

జయభేరి ఆధ్వర్యాన...

జయభేరి సంస్థ చైర్మన్, సినీనటుడు మాగంటి మురళీమోహన్ జన్మదినాన్ని పురస్కరించుకుని జయభేరి గ్రూప్ ఆధ్వర్యాన సిబ్బంది రక్తదానం చేశారు. ఈ మేరకు 35 మంది స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేశారు. కార్యక్రమంలో షోరూం అసిస్టెంట్ జనరల్ మేనేజర్ శాంతారావు, రెడ్‌క్రాస్ ప్రతినిధులు పి.చైతన్యకుమార్, కె.సత్యనారాయణ, ప్రకాష్, సుజాత పాల్గొన్నారు.

విలేకరి రక్తదానం

పలాస : కాశీబుగ్గకు చెందిన దుర్యోధన సాయిరాం ఆలయంలో చేస్తున్నాడు. ప్రస్తుతం ఆయనకు అనారోగ్యంతో బాధపడుతూ ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. రక్తం అవసరం కావడంతో విషయం తెలుసుకున్న ఆంధ్రజ్యోతి రిపోర్టర్ హరినారయణ, ఆలయంలో సేవ చేస్తున్న యువకులు రక్తదానం చేశారు.



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి- రణస్థలం

మండలంలోని వెంకటరావుపేటలో పాతర్లపల్లి ఆర్‌అండ్‌బి రోడ్డు నుంచి ఉప్పివలస, వెంకటరావుపేటకు రూ.1.36 కోట్ల వ్యయంతో బిటి రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ రోడ్డు నిర్మాణంతో చాలా గ్రామాలకు రహదారి సమస్య పరిష్కారం అవుతుందని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి, ఎంపిపి ప్రతినిధి పిన్నింటి సాయికుమార్, ఎచ్చెర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రతినిధి లంకలపల్లి ప్రసాద్, జడ్‌పిటిసి టొంపల సీతారాం, జెసిఎస్ ఇన్‌ఛార్జి చిల్ల వెంకటరెడ్డి, వైస్ ఎంపిపి రాయపురెడ్డి బుజ్జి, బిసి కార్పొరేషన్ డైరెక్టర్ పిల్ల ఆనంద్ పాత్రుడు, పంచాయతీ డిఇ ధర్మారావు, ఎఇ పోలినాయుడు పాల్గొన్నారు.

బాహుదా ఛానల్ మరమ్మతులకు
నిధులు మంజూరు చేయాలి

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురంలో బాహుదా నదిపై ఉన్న ఛానల్ మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్సీ నర్తు రామారావు కోరారు. ఈ మేరకు కలెక్టరేట్‌లోని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్‌ను శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బెల్లుపడ రైతులకు చెందిన వెయ్యి ఎకరాల భూములకు సాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ ఛానల్ మరమ్మతులు చేపట్టినట్లయితే రైతులకు మేలు కలుగుతుందన్నారు. అలాగే బాహుదా ఎడమ కాలువ తిత్లీ తుపాను సమయంలో గట్టు కొట్టుకుపోయిందని వివరించారు.



వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్సీ రామారావు



పరిశీలిస్తున్న ఎంఇఒ లావణ్య

భోజనం నాణ్యతగా ఉండాలి

రణస్థలం: పాఠశాల విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం రుచిగా, పరిశుభ్రమైన వాతావరణంలో, నాణ్యతతో కూడిన భోజనం అందించాలని ఎంఇఒ-2 బి.లావణ్య ఆదేశించారు. రణస్థలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎండిఎం, జెవికే స్టాక్ పాయింట్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వంట కార్మికులు పరిశుభ్రంగా ఉంటూ రుచికరమైన భోజనం వండి విద్యార్థులకు పెట్టాలన్నారు. అలాగే జెవికె కిట్లు విద్యార్థులకు పూర్తిస్థాయిలో అందించాలన్నారు. నూతన విద్యాసంవత్సరం ప్రారంభమైందని, కోటి ఆశలతో వచ్చిన విద్యార్థుల ఆకాంక్షలను తీర్చిదిద్దేలా పాఠశాల ఉండాలని అన్నారు. ఒత్తిడిని తగ్గించి మానసికోల్లాసాన్ని కల్పించే విధంగా బోధన చేయాలని అన్నారు. ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం బి.రమణయ్య, సిఆర్‌పిలు యు.శ్రీనివాస్, పైడినాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు పంపిణీ

పొందూరు: మండలంలోని లోలుగు ఉపహార్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యాన ఏడు దీర్ఘకాలిక రోగుల కుటుంబాలకు శనివారం సంస్థ ఏరియా మేనేజర్ బి.ఎం.పాల్ పంపిణీ చేశారు. ఈ కుటుంబాలకు మూడు నెలలకు సరిపడే బియ్యం, పప్పులు, ఆయిల్, రాగి పౌడర్‌లను అందజేశారు. సంస్థ కో-ఆర్డినేటర్ ఏసుదాసు, కమ్యూనిటీ ఫెసిలిటేటర్ లోపింటి అప్పారావు, సిబ్బంది ఉగాది, మోహన్ పాల్గొన్నారు.